సాక్షి రంగారెడ్డి

సోమవారం । 1 । ఏప్రిల్ । 2024



ఓట్లతో బుద్ధి చెప్పాలి

కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య కోరారు. 8లో▸



కాంగ్రెస్ గెలుపునకు కృషి

లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
సోమవారం సాయంత్రం 6:35	మంగళవారం ఉదయం 4:48

న్యూస్‌రీల్

లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల వికారాబాద్ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యార్థినులకు ఇంగ్లిష్ బోధన కోసం పార్ట్‌టైమ్ ప్రాతిపదికన లెక్చరర్‌గా పని చేసేందుకు ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌శర్మ పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు కలిగి ఉండాలని, పీహెచ్‌డీ, నెట్‌సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులకు సర్టిఫికెట్ కాపీలను జత చేసి ఈ నెల 3వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు మొయినాబాద్ మండలం తోల్‌కట్ట సమీపంలోని వికారాబాద్ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. స్కీనింగ్ టెస్ట్ డెమో ద్వారా ఉద్యోగ నియామకం ఉంటుందన్నారు. మరింత సమాచారం కోసం 95810 92637 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జిల్లా మాస్ మీడియా అధికారికి ఘన సన్మానం



నరహరి దంపతులను సన్మానిస్తున్న అధికారులు

షాద్‌నగర్: వైద్య ఆరోగ్యశాఖలో మాస్ మీడియా జిల్లా అధికారిగా పని చేస్తున్న నరహరి ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సన్మానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులుతో పాటు వైద్య సిబ్బంది తరలివెళ్లారు. నరహరి దంపతులకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు బోసుపల్లి ప్రతాప్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బోసుపల్లి ప్రతాప్

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించడానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మున్సిపాలిటీ అధ్యక్షుడు శిగ వీరస్వామిగౌడ్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు బోసుపల్లి ప్రతాప్, పోరెడ్డి నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరోసారి బీజేపీని కేంద్రంలో అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. భువనగిరి లోక్‌సభ అభ్యర్థిగా డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొట్టు రమేష్, ఉడుతల అశోక్, గజ్జల నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను ఆదాయం రూ.1,910 కోట్లు

ఆదివారం రాత్రి 9.30 గంటల వరకు వసూళ్లు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఖజానాకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.1,910 కోట్ల ఆస్తిపన్ను వసూలైంది. ఆదివారం రాత్రి 9.30 గంటల వరకు ఈ మొత్తం వసూలైంది. ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను వసూలు లక్ష్యం రూ.2,100 కోట్లు కాగా, గత నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు, త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల వల్ల ట్యాక్స్ సిబ్బంది ఎన్నికల విధులు కూడా నిర్వహించాల్సి వచ్చింది. అయినప్పటికీ కమిషనర్, తదితర అధికారులు ఎప్పటికప్పుడు తగిన ఆదేశాలివ్వడం, చర్యలు తీసుకోవడంతో ఈ మొత్తం వసూలైంది. ఆస్తిపన్ను వసూళ్ల కోసం వందల సంఖ్యలో వాణిజ్య భవనాలకు అధికారులు తాళాలు కూడా వేశారు. ఆస్తిపన్ను వసూళ్లకు సంబంధించి కచ్చితమైన వివరాలు సోమవారం తెలియనున్నాయి.

నిప్పు.. ముప్పు



కాటేదాన్‌లోని ఓ పరిశ్రమలో అగ్ని ప్రమాదంతో వెలువడుతున్న దట్టమైన పొగ (ఫైల్)

భగ్గున మండుతున్న ఎండలు

- పెరుగుతున్న అగ్నిప్రమాదాలు
- తరచూ వెలుగుచూస్తున్న ఘటనలు
- పెద్ద ఎత్తున ఆస్తినష్టం
- ప్రాణాల మీదికి తెస్తున్న నిర్లక్ష్యం
- ఇళ్ల మధ్యే స్క్రాప్ గోదాంలు.. రసాయన పరిశ్రమలతో భయంభయం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎండలు భగ్గున మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు నమోదవుతోంది. చెట్లు ఆకులు రాలుతున్నాయి. రాలిన ఆకులను, పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ కవర్లను ఒకచోట కుప్పగా పోసి తగలబెడుతుండటంతో పాటు ఆయా సంస్థల్లో పని చేస్తున్న సిబ్బంది బీడీ, సిగరెట్ తాగి పీకలను వాటిలో పడేస్తుండడంతో మంటలు అంటుకుంటున్నాయి. ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం ఏసీలు, కూలర్లు ఆన్ చేయడం, సామర్థ్యానికి మించి విద్యుత్‌ను వినియోగిస్తుండటంతో షార్ట్‌సర్క్యూట్ తలెత్తి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో మంటలు ఆర్పేందుకు అనువైన వ్యవస్థ అందుబాటులో లేకపోవడంతో ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకునే లోపే ఆస్తులు బుగ్గి అవుతున్నాయి. కొన్ని సంస్థల్లో అగ్ని మాపక వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నా నిర్వహణ లోపాలతో పని చేయడం లేదు. స్క్రాప్ దుకాణాలు, టింబర్ డిపోలు, సినిమా హాళ్లు, హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, ప్లాస్టిక్ పరిశ్రమలు, వాణిజ్య భవన సముదాయాల్లో ప్రమాదాలు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి.

నిర్వహణ సరిగా లేకే..

జిల్లాలో హయత్‌నగర్, మహేశ్వరం, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, మాదాపూర్, చేవెళ్లలో ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 2021–22లో 382 అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. రూ.32.18 కోట్ల ఆస్తినష్టం వాటిల్లింది. 26 మంది మృత్యువాత పడ్డారు. శేరిలింగంపల్లి, కాటేదాన్, హయత్‌నగర్, చేవెళ్ల, షాద్‌నగర్, శంషాబాద్‌లోనే అత్యధిక ప్రమాదాలు వెలుగు చూశాయి. అగ్నిమాపక కేంద్రాలకు 2023లో 3,151 ఫోన్‌కాల్స్ రాగా, 2024లో 2,550 కాల్స్ వచ్చాయి. గత ఏడాది అగ్నిమాపక శాఖ నుంచి 3,060 ఆస్పత్రులు, విద్యా సంస్థలు, పరిశ్రమలు, షాపింగ్ మాల్స్ నిరంభ్యంతర పత్రాలు పొందాయి. వీటిలో అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసినప్పటికీ మెజార్టీ భవనాల్లో నిర్వహణ మరిచి పోయారు. తరచూ ఇంట్లో వెలుగు చూసే ప్రమాదాలకు రిఫ్రిజిరేటర్, ఓవెన్, గ్యాస్ లీకేజీలు కారణమవుతుంటే.. స్క్రాప్‌గోదాములు, టింబర్ డిపోలు, ప్లాస్టిక్ పరిశ్రమల్లో వెలుగు చూసే ప్రమాదాలకు కార్మికులు పీల్చి వదిలేసే బీడీ, సిగరెట్ ముక్కలు కారణమవుతున్నాయి. వాణిజ్య సంస్థలు, హోటళ్లలో వెలుగు చూసే అగ్ని ప్రమాదాలకు ఏసీలు, గ్రీజర్లు, ఇతర ఎలక్ట్రికల్ పరికరాలు, లూజ్ కాంటాక్టులు కారణమవుతున్నాయి. సినిమా హాళ్లు, ఐటీ అనుబంధ సంస్థలు, పరిశ్రమల్లో వెలుగు చూసే ప్రమాదాలకు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లు, హీటెక్కుతున్న యంత్రాలు కారణమవుతున్నాయి. నిజానికి ఆయా యజమానులు భవన నిర్మాణ సమయంలో అగ్నిమాపక చర్యలు చేపడుతున్నారు. వాటర్, గ్యాస్ పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. సీఓటు గ్యాస్ నింపిన సిలిండర్లు గోడలకు అమర్చుతున్నారు. సీలింగ్ కింది భాగంలో రెయిన్ స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. కానీ మెజార్టీ యజమానులు వాటి నిర్వహణ మర్చిపోతున్నారు. చాలా పరిశ్రమల్లో ఫైర్ అలారం పని చేయడం లేదు. ట్యాంకుల్లో సరిపడా నీళ్లు ఉండటం లేదు. సిలిండర్లలో రసాయనాలు కన్పించడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో మంటలను ఆర్పేందుకు విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది యత్నించినా ఉపయోగం ఉండటం లేదు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది.

నివారణ చర్యలు



- అగ్నిమాపక వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని వేళల్లో పని చేస్తుందో లేదో పరిశీలించాలి.
- మంటలు ఆర్పే పరికరాలు పని చేస్తున్నాయో లేదో గుర్తించాలి.
- ఎయిర్ కండిషనింగ్ ద్వారా మంటలు వ్యాప్తి చెందకుండా డ్యాంపర్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- విద్యుత్ వైరింగ్, ఉపకరణాలు, స్విచ్‌లు, ఇతర పరికరాలను పరిశీలించి లోపాలుంటే వెంటనే సరి చేసుకోవాలి.
- అతుకులు ఉన్న విద్యుత్ తీగలు, వదులుగా ఉన్న వైరింగ్‌ను ఉపయోగించొద్దు.
- ఫ్రిజ్, ఓవెన్‌లను వంటగదిలో కాకుండా గాలి, వెలుతురు తగిలే చోట ఉంచాలి.
- ఎలక్ట్రిక్ వైర్లను కార్పొరేట్ల కింద, చాపల కింద నుంచి పోనివ్వొద్దు.
- అధిక ఓల్టేజీ విద్యుత్ ఉపకరణాలు వాడే సమయంలో ఎర్తింగ్ ఉన్న త్రీపిన్ సాకెట్స్‌ను తప్పని సరిగా వాడాలి.
- చెత్తకుప్పలకు నిప్పు పెట్టకూడదు.

– శ్రీనివాసరావు, సీఈఐజీ

ఇటీవల జరిగిన కొన్ని ప్రమాదాలు

- శంషాబాద్ మండలం రాళ్లగూడలోని కేబీఎస్ స్క్రాప్ గోదాంలో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. పక్కనే ఉన్న ప్రియాంక గ్యాస్ ఏజెన్సీకి ఎగబాకాయి. సిబ్బంది వెంటనే అప్రమత్తమై 80పైగా సిలిండర్లను సురక్షిత ప్రాంతానికి తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు చెత్తకు నిప్పు పెట్టడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు.
- వట్టినాగులపల్లిలోని ఓకార్ల గోదాంలో షార్ట్‌సర్క్యూట్‌తో భారీగా మంటలు చెలరేగాయి. గోదాంలో పార్కింగ్ చేసిన 20కిపైగా కార్లు దగ్ధం అయ్యాయి. సమీపంలోనే ఫైర్ స్టేషన్ ఉండటం, వెంటనే అగ్నిమాపక చర్యలు చేపట్టడంతో ప్రాణ నష్టం తప్పింది.
- రాజేంద్రనగర్ కాటేదాన్ పారిశ్రామిక వాడలోని రవి ఫుడ్స్ కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. నిత్యం 500 మందికిపైగా పని చేసే ఈ కంపెనీలో అగ్నిమాపక చర్యలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పది ఫైరింజన్లు సుమారు 12 గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పాల్సి వచ్చింది.
- ఆదివారం శేరిలింగంపల్లిలోని ఆలిండ్ పరిశ్రమలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఎండిపోయిన చెట్లు తగలబడిపోయాయి. ఫైర్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై, మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది.
- షాద్‌నగర్‌లోని మిలినియం టౌన్‌షిప్ సమీపంలో రెండు రోజుల క్రితం తుక్కుగోదాంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తలెత్తింది. ప్లాస్టిక్ సామగ్రి పూర్తిగా దగ్ధమైంది.
- తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి తొర్రూర్‌లోని గీతా టింబర్‌డిపోలో రెండు రోజుల క్రితం భారీ అగ్ని ప్రమాదం వెలుగు చూసింది. భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.
- మార్చి 24న శంకర్‌పల్లిలోని ఓ కిరాణ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. సుమారు రూ.10 లక్షల విలువ చేసే ఆస్తి దగ్ధమైంది. మార్చి 15న టోలిచౌకిలోని ఓ ఆయిల్ గోదాంలో అగ్ని ప్రమాదం వెలుగు చూసింది.



ఉత్సాహంగా.. ఉల్లాసంగా

తలకొండపల్లి మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో అంతరాష్ట్రీయ బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి.

– తలకొండపల్లి

మా ప్రభుత్వానికి ప్రజాదరణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

లింగోజిగూడ: వంద రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆదరాభిమానాలను చూరగొందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ అధ్యక్షతన కర్మన్‌ఘాట్‌లోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మల్కాజిగిరి లోక్‌సభ నుంచి గత ఎన్నికలలో సీఎం రేవంత్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించారని, ఈసారి పట్నం సునీతారెడ్డిని అదే రీతిలో గెలిపించాలని కోరారు. త్వరలో తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీలతో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో డివిజన్ వారీగా సమావేశాలు నిర్వహించి బూత్ స్థాయి నుంచి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. మధుయాష్కీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేళ్ల దుర్మార్గ పాలనకు.. వంద రోజులుగా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన ఆస్తులను కాపాడుకోవడానికి తిరిగి కాంగ్రెస్‌లోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. మల్కాజిగిరి లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మల్కాజిగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు జయమ్మ, కార్పొరేటర్ సుజాతా నాయక్, మాజీ కార్పొరేటర్లు సామ రమణారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, నాయకులు ఎస్వీ కృష్ణప్రసాద్, మల్లారపు శ్రీనివాస్, బుద్ధ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఇన్‌చార్జిగా నరేందర్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని నాలుగు లోక్‌సభ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఆదివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. చేవెళ్లకు నరేందర్ రెడ్డి, సికింద్రాబాద్‌కు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, మల్కాజిగిరికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, హైదరాబాద్‌కు ఒబేదుల్లా కొత్వాల్ నియమితులయ్యారు. అదేవిధంగా ఏఐసీసీ ఇన్‌చార్జిలుగా హైదరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాలకు రోహిత్ చౌదరి, మల్కాజిగిరి, చేవెళ్ల నియోజకవర్గాలకు విష్ణునాథ్ నియమితులయ్యారు.

జిల్లా అభివృద్ధికి ఏం చేశారు?



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

- రాహుల్ గాంధీ పేరెత్తకుండా నేను ప్రచారం చేస్తా
- మోదీ పేరెత్తకుండా నువ్వు ప్రచారం చేస్తావా?
- బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరెడ్డికి రంజిత్‌రెడ్డి ప్రతిసవాల్
- తాండూరు కార్యకర్తలతో సమావేశం

తాండూరు: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ పేరును ప్రస్తావించకుండా ముందుకెళ్లేందుకు సిద్ధమా అని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విసిరిన సవాల్‌ను తాను స్వీకరిస్తానని.. ఆయన ప్రధాని మోదీ పేరు ప్రస్తావించకుండా ప్రచారానికి వెళ్లేందుకు సిద్ధమా అని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ప్రతి సవాల్ విసిరారు. తాండూరు పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రంజిత్ రెడ్డి మాట్లాడుతూ... బీజేపీ అభ్యర్థి కొండా ఏది నోటికి వస్తే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. గతంలో ఇక్కడ నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన కొండా వికారాబాద్ జిల్లా అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలన్నారు. ఆయనకు పార్టీలు మారడంపై ఉన్న శ్రద్ధ స్థానిక సమస్యలను పరిష్కరించడంపై లేదన్నారు. నేను ఎంపీగా ఉన్న ఐదేళ్ల కాలంలో కొంతవరకైనా ఈ ప్రాంతానికి, ఈ ప్రాంత ప్రజలకు న్యాయం చేశానన్నారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతఅభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. చేవేళ్ల పార్లమెంట్ స్థానం గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాండూరు ప్రజలు తనను కాంగ్రెస్ పార్టీలో చేరిన 35 రోజుల వ్యవధిలో ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. అలాగే రంజిత్‌రెడ్డిని కూడా ఇక్కడి నుంచి గెలిపించి రాహుల్ గాంధీకి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, డీసీసీబీ డైరక్టర్లు లక్ష్మారెడ్డి, రవిగౌడ్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, రాష్ట్ర నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, నీరజ, రత్నమాల, వెంకన్నగౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

రన్ ఫర్ పీస్

ప్రపంచ శాంతిని కోరుతూ ఆదివారం జలవిహార్ నుంచి పీవీ నరసింహారావు మార్గ్ నిర్వహించిన అహింసా 2వ ఎడిషన్ రన్‌ను చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ వికాస్ రాజ్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాసామ్య పండగలో పాల్గొనిరానున్న ఎన్నికల్లో అందరూ ఓటు వేయాలని ఆయన సూచించారు. ఐఐఎఫ్‌ఎల్ జీతో హైదరాబాద్ చైర్మన్ సుశీల్ సంచేటి, ప్రధాన కార్యదర్శి పరేష్ షా, కోశాధికారి బీఎల్ బండారీ, వీణాజైన్, సెక్రటరీ టీనా షా తదితరులు పాల్గొన్నారు.

– ఖైరతాబాద్



పరుగును ప్రారంభిస్తున్న వికాస్ రాజ్ తదితరులు



బ్యాగరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సత్తయ్య



కందుకూరు: తెలంగాణ మాల, బ్యాగరి కాటి కాపర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కందుకూరుకు చెందిన గాదె సత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా గాదె మల్లేశ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గాదె కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నకేశవులు ఆదివారం నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాల బ్యాగరుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.

పోలీసుల సంరక్షణలో తప్పిపోయిన చిన్నారి

రాంగోపాల్‌పేట్ : ఐదేళ్ల ఓ చిన్నారి తప్పిపోయి రోడ్డుపై తిరుగుతుండగా మార్కెట్ పోలీసులు చేరదీశారు. పోలీసుల కథనం ప్రకారం.. వెస్ట్ మెట్రో స్టేషన్ ప్రాంతంలో ఐదేళ్ల చిన్నారి తిరు గుతూ.. పెట్రో లింగ్ పోలీసులకు కనిపించాడు. వివరాలు ఆరా తీయగా తన పేరు కిరణ్, తండ్రి పేరు నరసింహ అని చెప్పాడు. ఎక్కడ ఉండేది తదితర వి వరాలు చెప్పలేక పోయాడు. పోలీసులు సీడబ్ల్యూసీ అధికారులకు అప్ప గించారు. సంబంధీకులు ఉంటే మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

బీజేపీకి ఓట్లతో బుద్ధి చెప్పాలి



సభలో మాట్లాడుతున్న జంగయ్య

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

మీర్‌పేట: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలంతా తిప్పికొట్టాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య కోరారు. సీపీఐ బాలాపూర్ మండల నిర్మాణ మహాసభను ఆదివారం మీర్‌పేట కార్పొరేషన్ లెనిన్‌నగర్‌లోని బుడగ జంగాల కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదనంతా అదానీ, అంబానీలకు కట్టబెట్టడంతో పాటు ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి పేద, మధ్య తరగతి ప్రజలను పేదరికంలోకి నెడుతోందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలంతా ఓట్లతో బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్య క్రమంలో నాయకులు పానుగంటి పర్వతాలు, చంద్రశేఖర్ ఎడ్డి, శంకరయ్య, దశరథ, ఛత్రునాయక్, అంజయ్య, రామస్వామి, యాదయ్య, వీరస్వామి, శివ, మహేశ్వరి పాల్గొన్నారు. అనంతరం బాలాపూర్ మండల సమితి నూతన కమిటీని ఎన్నుకున్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

రాజేంద్రనగర్: పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పక్కనే ఉన్న రోడ్డుపై పల్టీ కొట్టిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కారులోని బెలూన్లు ఓపెన్ కావడంతో ప్రయాణికునికి స్వల్ప గాయాలు, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఓ ప్రయాణికుడు మెట్రో బిజినెస్ సర్వీసుకు చెందిన ఎలక్ట్రిక్ కారు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నాడు. కారు డ్రైవర్ పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై పై వేగంగా వెళుతూ పిల్లర్ నంబర్ 150 వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పక్కనే ఉన్న రోడ్డుపై పల్టీ కొట్టింది. ఎయిర్ బ్యాగ్ కావడంతో ప్రయాణికునికి స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో వాహనదారులు అద్దాలు పగలగొట్టి అతడిని బయటికి తీసి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

చేవెళ్లలో కాంగ్రెస్ గెలుపునకు కృషి

- మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్
- బీఆర్‌ఎస్ నుంచి హస్తం పార్టీలో భారీగా చేరికలు



కేఎల్లార్, భాస్కర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు


దిల్‌సుఖ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్), సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రామకృష్ణాపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు యాదవ్‌రెడ్డి, లింగస్వామిగౌడ్, శ్రీనివాసులు, పగడాల ఎల్లయ్య, శ్యాంసుందర్‌గౌడ్, శ్రీనివాసులుతో పాటు పలువురు నాయకులు కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా గత పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలు విసిగి పోయారన్నారు.ఎప్పుడు ఎన్నికలు జరిగిన కాంగ్రెస్ పార్టీని చేవెళ్ల పార్లమెంట్‌లో భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తప్పుడు విధానాలతో ప్రజాస్తులను కార్పొరేట్ కంపెనీలకు దోచి పెడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగ్గిన బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో రమేశ్, మధుయాదవ్, శంకర్, సుజాతారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణారావు తదితరులున్నారు. కార్యక్రమంలో నాయకులు గణేష్‌నేత, ఉపేందర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, మధుసూదన్‌రావు, మహేందర్, రవీంద్ర, సురేశ్, కాశీదాస్,సైదులు, శ్రీకాంత్‌రెడ్డి, విప్లవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

అబ్దుల్లాపూర్‌మెట్: స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మండలంలోని పలు ఆలయాలను ఆదివారం దర్శించుకున్నారు. పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని లక్ష్మారెడ్డిపాలెం మైత్రీకుటీర్ కాలనీలో మైసమ్మతల్లి కల్యాణోత్సవంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మజీద్‌పూర్ రెవెన్యూ పరిధిలోని మహామ్మాయిపురంలో మహామ్మాయిదేవి రథోత్సవం, లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సిద్దంకి కృష్ణారెడ్డి, కాలనీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డిలతో పాటు కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తలకొండపల్లి: క్రిమి సంహారక(పురుగు) మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ చెప్పిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీశైలం(45) ఇటీవల కుటుంబ కారణాలతో మనోవేదనకు గురవుతున్నారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరి గ్రామ శివారులో ఆయన కౌలుకు తీసుకున్న పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన కుటుంబ సభ్యులు విగత జీవిగా పడిఉన్న శ్రీశైలంని గమనించారు. అప్పటికే ఆయన మృతి చెందారు. పక్కన క్రిమి సంహారక మందు డబ్బా ఉంది. ఈ మధ్యనే మృతుడు మానసికంగా బాధపడుతున్నారు. దీంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. భార్య వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు కుమారులున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చేవెళ్లలోని సీపీఐ కాలనీలో సంఘటన

చేవెళ్ల: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీపీఐ కాలనీలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు మండలం ఎముల నర్వ గ్రామానికి చెందిన అబ్దుల్ షేక్ మహ్మద్(55) భార్య కొన్ని రోజుల కిత్రమే చనిపోయింది. దీంతో ఒంటరిగా ఉంటున్న ఆయన జేపీ దర్గా వద్ద బిక్షాటన చేసేవారు. ఇటీవల మహ్మద్ గ్రామానికి చెందిన బీబీ బేగం, రజియాబేగం జియాగూడకు చెందిన ఖాదర్‌లతో కలిసి ఎక్కడ జాతర జరిగితే అక్కడికి వెళ్లి బొమ్మలు, బెలూన్‌లు అమ్ముకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. చేవెళ్లలో శివరాత్రి జాతర సందర్భంగా నలుగురు కలిసి సీపీఐ కాలనీలో ఓ గదిని అద్దెకు తీసుకొని జాతరలో బొమ్మలు, బెలూన్‌లు అమ్ముకుంటున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం మహ్మద్ మద్యం తాగి గదిలోనే పడుకున్నారు. రాత్రి ఆయన ముక్కులో నుంచి రక్తం కారుతూ అనుమానాస్పదంగా మృతి చెందారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా గదిలో ఉండే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. బాగా మద్యం తాగి ఆయాసం వచ్చి నిద్రపోయి మృతి చెందినట్లు నిందితులు పోలీసులకు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి పోస్టుమార్టం కోసం చేవెళ్ల ఆస్పత్రికి తరలించారు. నివేదిక ఆధారంగా మృతికి సంబంధించి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు వివరించారు.

వ్యక్తి మృతిపై అనుమానాలు

కేసు నమోదు చేసిన పోలీసులు



భిక్షపతి (ఫైల్)

నందిగామ: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నర్సప్పగూడలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. నందిగామ ఎస్సై గోపాల కృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జంగిలి భిక్షపతి అలియాస్ భిక్షమయ్య (45) మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి ఆయన మద్యం తాగి ఇంట్లో మంచంపై నిద్రించారు. అర్ధరాత్రి వేళలో మంచంపై నుంచి కిందపడి చనిపోయాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో షాబాద్‌లో ఉన్న ఆయన సోదరుడు జయరాజ్ ఇంటికి చేరుకొని అన్న మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

మృతదేహంపై గాయాలు

భిక్షపతి మృతిపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. మంచంపై నుంచి కిందపడితే పెదవులపై రక్తగాయాలు ఎలా ఉంటాయని, అదే విధంగా గొంతుపై గాట్లు ఎందుకు ఉంటాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయమై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టినట్లయితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

విద్యుత్ సర్వీస్ వైర్ల అపహరణ

రైతులకు రూ.లక్షన్నరపైగా నష్టం

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకులమైలారం గ్రామంలో దుండగులు శనివారం రాత్రి వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ సర్వీస్ తీగలను అపహరించారు. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకులమైలారం గ్రామంలోని పది మంది రైతులకు చెందిన వ్యవసాయ బావుల వద్ద ఉన్న మోటార్ల సర్వీస్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వాటి విలువ దాదాపు రూ.లక్షన్నరకు పైగానే ఉంటుందని రైతులు తెలిపారు. అదే విధంగా వారం క్రితం గ్రామంలోని మరో పది మంది రైతులకు చెందిన బోరు మోటార్ల సర్వీస్ వైర్లను కూడా అపహరించారు. ఓ మోటార్ సైకిల్‌పై వచ్చిన దుండగులను సమీప రైతులు ఫొటో తీసి పోలీసులకు అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

2.1 కిలోలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: వండర్‌లా సమీపంలో చేతిలో గంజాయి పట్టుకొని తిరుగుతున్న వ్యక్తులను ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం పక్కా సమాచారంతో వండర్‌లా వద్ద ముగ్గురు చేతిలో గంజాయి పట్టుకున్నారని ఆదిబట్ల పోలీసులు దాడి చేశారు. బిహార్‌కు చెందిన వకిల్‌కుమార్(31), పశ్చిమబెంగాల్‌కు చెందిన సబీర్‌గాజీ(24), కోకస్ గాజీ(30)లను అరెస్టు చేశారు. వారి నుంచి 2.1 కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ రాజు, వెంకటేశ్‌లను సీఐ అభినందించారు.

వ్యాపారానికి నగర పరిసరాలు అనుకూలం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, ఏపీ మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి, ఏపీ ఎమ్మెల్యేలు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- మోకిలలో టైల్స్, శానిటరీ షోరూమ్ ప్రారంభం

చేవెళ్ల: హైదరాబాద్‌తోపాటు చుట్టూ ఉన్న ప్రాంతాలు కూడా వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లి మండలంలోని మోకిల గ్రామంలో ఆదివారం ఆధునిక హంగులతో కార్పొరేట్‌స్థాయిలో ఏర్పాటు చేసిన చరిత టైల్స్, శానిటరీ షోరూమ్‌ను ఆయన ఏపీ మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి, ఏపీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా ప్రతాప్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామమైన మోకిల సైతం ప్రపంచస్థాయి ఉత్పత్తులను విక్రయించే షోరూమ్‌లు వెలిసే స్థాయికి ఎదిగిందన్నారు. హైదరాబాద్‌కు చుట్టూ ఉన్న ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. నగరంలో రోజురోజుకు జనాభా పెరిగిపోతుండటంతో పట్టణం విస్తరిస్తోందన్నారు. చరిత టైల్స్, శానిటరీ షోరూమ్‌ను ఏర్పాటు చేసిన చెన్నారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డిలను అభినందించారు. కార్యక్రమంలో శిల్ప రవిచంద్రకిషోర్‌రెడ్డి, నాయకులు పట్లోళ్ల నర్సింహారెడ్డి, జాగ్వార్ గ్రూప్ ప్రతినిధి అభిజిత్‌సింగ్, సూర్య ఇంటర్‌నేషనల్ ఎండీ పెండ్యాల హరినాథ్‌బాబు, వివిధ కంపెనీల ప్రతినిధులు వదిరాజ్ పిఅశ్రిత్, వాణిశ్రీ సెగు, అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై సభ్యుల అసంతృప్తి

- ముగిసిన బాటసింగారం సహకార సంఘం సమావేశం



మాట్లాడుతున్న చైర్మన్ చేగూరి భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఎజెండాలో పొందుపర్చిన అంశాలను సమావేశంలో చర్చించారు. గతేడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 29వ తేదీ వరకు సంఘం పరిపాలన నివేదికను మేనేజర్ ఐలేశ్‌యాదవ్ సభ్యులకు వినిపించారు. సమావేశంలో పలువురు సభ్యులు సంఘం పరిధిలో చోటుచేసుకుంటున్న పలు అంశాలపై పూర్తి వివరాలను వివరించాలన్నారు. కొన్ని అంశాలను గోప్యంగా ఎందుకు పెడుతున్నారని అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దాసుగౌడ్, మాజీ చైర్మన్లు విఠల్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, వైస్ చైర్మన్ మల్లమ్మజంగమయ్య, డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, చిన్నయాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మమ్మ, మహిపాల్‌రెడ్డి, రాములు, బాలనరసింహ, బాల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య తోపులాట

మాజీ చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి సర్వసభ్య సమావేశానికి కొంతమంది అనుచరులతో కలిసి వస్తుండగా రిజిస్టర్‌లో సంతకాలు చేసే విషయంలో సంఘం సిబ్బంది దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు. దీనిపై చైర్మన్ భరత్‌కుమార్ వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వాదించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది.

ప్రియురాలితో చనువుగా ఉంటున్నాడని..

- యువకుడిపై మరో యువకుడి దాడి

అత్తాపూర్: తన ప్రియురాలితో చనువుగా ఉంటున్నాడనే కారణంతో ఓ యువకుడిపై మరో యువకుడు దాడి చేసిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతల్‌మెట్ సల్వా అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ముస్తఫా నిర్మాణ రంగంలో పనిచేస్తున్నాడు. అతడికి టోలిచౌకికి చెందిన అఫ్నాన్ అహ్మద్, అనోస్ స్నేహితులు. అఫ్నాన్ మహ్మద్ ప్రియురాలితో ముస్తఫా చనువుగా ఉంటున్నట్లు గుర్తించిన అఫ్నాన్ పలుమార్లు అతడిని హెచ్చరించాడు. అయినా అతడి వైఖరిలో మార్పు రాలేదు. ఆదివారం ముగ్గురు స్నేహితులు ముస్తఫా ఇంట్లో మద్యం తాగారు. ఈ సందర్భంగా తన ప్రియురాలితో చనువుగా మాట్లాడుతున్న విషయమై అఫ్నాన్ ముస్తఫాను నిలదీశాడు. మాటా మాటా పెరగడంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో ముస్తఫాపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. బాధితడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌లో వస్త్రాలను తిలకిస్తున్న శైలజా రామయ్యర్, సింగర్ ఉష

శ్రీనగర్‌కాలనీ: నాణ్యమైన పట్టు, కాటన్ వస్త్రాలకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ గ్యారంటీగా నిలుస్తుందని రాష్ట్ర హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. ఆదివారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను ఆమె సింగర్ ఉషతో కలిసి ప్రారంభించారు. చేనేత కళాకారుల ఉత్పత్తులను తిలకించి వారిని అభినందించారు. ప్రతిఒక్కరూ చేనేత ఉత్పత్తులను ధరించి వారికి తోడ్పాటు అందించాలని కోరారు.ఈ సందర్భంగా సింగర్ ఉష ఓ పాటను పాడారు. సిల్క్‌మార్క్‌తో నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరలకే అందిస్తూ చేనేతకారులను ప్రోత్సహిస్తున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ వినియోగదారులకు అందిస్తున్న నిర్వాహకులు శ్రీనివాసరావు కృషిని శైలజా రామయ్యర్ అభినందించారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 80 స్టాల్స్‌లో ఏర్పాటుచేశామని సిల్క్ ఇండియా సీఈఓ వినయ్ తెలిపారు. పోచంపల్లి, చెందేరి, ఇక్కత్, నారాయణ్‌పేట్, బెనారస్, కోల్‌కతాకు చెందిన విభిన్నమైన అరుదైన చీరలను ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, శ్రీదేవి నిరుప్, డాక్టర్ సుధావాణి, వాణి మోచెర్ల పాల్గొన్నారు. ఏప్రిల్ 7 వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.